# తెలంగాణ వెన్నెల వాక్కు

TGTEL/25/A0871

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :22 05-08- 2026 బుధవారం పేజీలు: 4 వెల:03/-



తెలంగాణ వెన్నెల వాక్కు **విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో





- చిన్నారులపై తీవ్ర ప్రభావం చూపుతున్న అరుదైన వైరస్
- అప్రమత్తమైన కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య శాఖలు
- ప్రభావిత జిల్లాల్లో ప్రత్యేక వైద్య బృందాల మోహరింపు

2

## ఇ--20 పెట్రోల్ విధానంపై కేంద్రం స్పష్టత

ముడి చమురు దిగుమతుల తగ్గింపే లక్ష్యం.. రైతుల ఆదాయ పెంపునకు ప్రాధాన్యం




2

## రాజకీయ కక్షసాధింపులకు, బ్లాక్‌మెయిల్‌కే 'హైడ్రా'...



హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో వచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, విపక్షాలను అణచివేయడానికి మరియు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం 'హైడ్రా' (న్ణ=ూూ) వ్యవస్థను ఒక ఆయుధంగా వాడుకుంటోందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిపై సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వం తమకు కావలసిన వారికి రూ. కోట్లు విలువైన

2

## తెలంగాణ అమరవీరుడి కుటుంబానికి కొండంత అండ: చిన్నారి భవిష్యకు పునర్జన్మ అందించిన మానవీయ ఉదంతం

హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ మాతృభూమి స్వేచ్ఛ కోసం, ప్రత్యేక రాష్ట్ర సాధన అనే పవిత్ర లక్ష్యం కోసం తన అమూల్యమైన ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు ఎన్నటికీ అమరమైనవి. స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన ఆ మహనీయుల కుటుంబాలను ఆదుకోవడం, వారి కష్టాల్లో తోడుగా నిలబడడం, వారి కన్నీళ్లను తుడవడం తెలంగాణ సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. ఆ పవిత్రమైన బాధ్యతను కేవలం మాటలకే పరిమితం చేయకుండా, చేతల్లో చూపిస్తూ తెలంగాణ ఉద్యమ అమరవీరుడు యాదిరెడ్డి కుటుంబానికి కొండంత అండగా నిలిచిన ఒక అత్యంత మానవీయ ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చింది. అమరుల కుటుంబ సంక్షేమం పట్ల ఉన్న నిబద్ధతను చాటిచెప్పిన ఈ



సంఘటన స్థానికంగా తీవ్ర భావోద్వేగాన్ని నింపింది.

ఈ కథనం యొక్క పూర్తి వివరాల్లోకి వెళితే... గత నెలలో మొయినాబాద్ ప్రాంతం వద్ద ఉన్న తెలంగాణ ఉద్యమ అమరవీరుడు యాదిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లడం జరిగింది. ఆ పరామర్శ సమయములోనే ఆ కుటుంబం నిశ్శబ్దంగా అనుభవిస్తున్న ఒక తీవ్రమైన మానసిక వేదన, దిగులు వెలుగు చూశాయి. యాదిరెడ్డి తమ్ముడి చిన్నారి కుమార్తె 'భవిష్య' తీవ్రమైన అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయాన్ని ఆ కుటుంబ సభ్యులు

2

## ట్రంప్ టారిఫ్‌లపై అమెరికాలో తీవ్ర నిరసన

25 రాష్ట్రాల కోర్టు సవాల్.. అధ్యక్ష అధికారాల దుర్వినియోగమని ఆరోపణలు




వాషింగ్టన్, ఆగస్టు 4: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల అమలు చేసిన కొత్త దిగుమతి సుంకాల (టారిఫ్‌ల)పై అమెరికాలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. భారత్‌తో పాటు 59 దేశాలు, యూరోపియన్ యూనియన్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 10 నుంచి 12.5 శాతం వరకు అదనపు సుంకాలు విధించడాన్ని వ్యతిరేకిస్తూ అమెరికాలోని 25 రాష్ట్రాలు కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ను ఆశ్రయించాయి.

న్యూయార్క్, కాలిఫోర్నియా, ఇల్లినాయిస్, వాషింగ్టన్ తదితర రాష్ట్రాల అటార్నీ జనరల్స్ దాఖలు చేసిన పిటిషన్‌లో కాంగ్రెస్ అనుమతి లేకుండానే అధ్యక్షుడు ఈ నిర్ణయం

2

## వృత్తి విద్యా కోర్సులు - ఉపాధికి బంగారు బాట



నిర్మల్: నేటి పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీలు సాధించడం మాత్రమే సరిపోవడం లేదు. ఉద్యోగం పొందాలంటే పనిలో నైపుణ్యం కూడా అవసర మవుతోంది. ఈ నేపథ్యంలో వృత్తి విద్యా కోర్సులు యువతకు ఉపాధి, స్వయం ఉపాధికి బలమైన మార్గంగా నిలుస్తున్నాయి.

ప్రభుత్వాలు, వివిధ శిక్షణా సంస్థలు ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో అనేక వృత్తి విద్యా కోర్సులను అంది స్తున్నాయి. కంప్యూటర్ నిర్వహణ, విద్యుత్ పనులు, వెల్డింగ్, మొబైల్ మరమ్మతులు, సౌర విద్యుత్ పరికరాల ఏర్పాటు, ఆరోగ్య సేవలు, అందాల సేవలు, హోటల్ నిర్వహణ, వస్తువుల విక్రయ నిర్వహణ, రవాణా సేవలు వంటి రంగాల్లో శిక్షణ పొందిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతాల యువతకు కూడా ఈ కోర్సులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. అనేక శిక్షణా కేంద్రాలు ఉచిత వసతి, భోజనం, శిక్షణ అనంతరం ఉద్యోగ కల్పన వంటి సౌకర్యాలను కల్పిస్తున్నాయి. శిక్షణ పూర్తయిన తర్వాత ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలతో పాటు సొంతంగా ఉపాధి ప్రారంభించే అవకాశాలు కూడా ఉన్నాయి.

నిర్మల్ జిల్లాలో ప్రతి సంవత్సరం వేలాది మంది యువకులు ఉన్నత విద్య పూర్తి చేసినా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. అలాంటి వారు వృత్తి విద్యా కోర్సుల వైపు అడుగులు వేస్తే తక్కువ సమయంలోనే ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. చదువు మధ్యలో నిలిపివేసిన వారికీ ఈ కోర్సులు మంచి అవకాశాన్ని కల్పిస్తున్నాయి.

నిపుణుల అభిప్రాయం ప్రకారం, విద్యతో పాటు ఒక వృత్తిలో నైపుణ్యం ఉంటే ఉద్యోగం పొందే అవకాశాలు మరింత పెరుగుతాయి. అందుకే విద్యార్థులు సంప్రదాయ విద్యతో పాటు ఏదో ఒక వృత్తిలో శిక్షణ పొందడం అవసరమని సూచిస్తున్నారు.

యువతకు అందుబాటులో ఉన్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే నిరుద్యోగ సమస్యను గణనీయంగా తగ్గించవచ్చు. డిగ్రీ ఒక్కటే కాదు... వృత్తి నైపుణ్యమే భవిష్యత్తుకు బలమైన పునాది అనే విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది.

TGTEL/25/A0871
తెలంగాణ వెన్నెల వాక్కు జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU



# అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులందరికీ పౌష్టికాహారం అందించాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

- ప్రతి చిన్నారి అభివృద్ధి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశం
- వలస కూలీల పిల్లలు, పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- అనుమతి లభించిన అంగన్వాడీ నూతన భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
- అంగన్వాడీ కేంద్రాల పనితీరు పర్యవేక్షణకు త్వరలోనే ప్రత్యేక అధికారుల నియామకం
- 'అభా' గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు
- గిరిజనాభివృద్ధి శాఖ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించాలని ఆదేశం



నిర్మల్, ఆగస్టు 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకున్న చిన్నారులందరికీ ప్రతిరోజు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంగన్వాడీ కేంద్రాల పనితీరు, గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలోని విద్యాసంస్థల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యాసంస్థలు, అంగన్వాడీల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి చిన్నారి శారీరక, మానసిక వికాస వివరాలను, బరువు, ఎత్తు కొలతలను హెల్త్ రికార్డుల్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. మండలాల్లో పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను ప్రత్యేకంగా గుర్తించి, వారి ఆరోగ్య పరిస్థితి మెరుగయ్యే వరకు తగిన పౌష్టికాహారం అందించాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో అంగన్వాడీ సూపర్వైజర్లు నిరంతరం కేంద్రాలను తనిఖీ చేస్తూ పిల్లల హాజరు, అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి నివేదికలు తయారు చేయాలన్నారు.

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ పక్కాగా జరిగేలా చూసేందుకు ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే సుదూర ప్రాంతాల నుండి వచ్చే వలస కూలీల పిల్లలను గుర్తించి, వారికీ అంగన్వాడీ కేంద్రాల ద్వారా విద్యతో పాటు పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'అభా' (ఆధీనా) ఆరోగ్య గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. నిర్మాణాలు ప్రారంభమైన అంగన్వాడీ నూతన భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత వయస్సు ఉన్న ప్రతి ఒక్క చిన్నారిని అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించేలా కార్యకర్తలు, ఆశా వర్కర్లు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. చుట్టుపక్కల ప్రజల్లో అంగన్వాడీ సేవలపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారుల ప్రాథమిక విద్యా వికాసానికి, ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కేంద్రాల నిర్వహణలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు.

అనంతరం గిరిజనాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో (హాస్టళ్లలో) విద్యార్థులకు అందిస్తున్న వసతులపై సమీక్షించారు. విద్యార్థులకు భోజనం, రాత్రి వేళల్లో బస చేయడానికి అనుకూలమైన పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలన్నారు. గిరిజన విద్యార్థులకు చెల్లించాల్సిన ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ ఉపకార వేతనాల (స్కాలర్‌షిప్పుల) పురోగతిపై సుదీర్ఘంగా చర్చించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి (డీటీడీఓ) నిహారిక, జిల్లా సంక్షేమాధికారి వినూత్న, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులపై తీవ్ర ప్రభావం చూపుతున్న అరుదైన వైరస్

అహ్మదాబాద్, ఆగస్టు 4: గుజరాత్ రాష్ట్రంలో చండీపుర వైరస్ విజృంభణ తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 184 అనుమానిత కేసులు నమోదుకాగా, వాటిలో 35 మందికి చండీపుర వైరస్ సోకినట్లు ప్రయోగశాల పరీక్షల్లో నిర్ధారణ అయింది. వైరస్ లక్షణాలతో చికిత్స పొందుతూ 22 మంది చిన్నారులు మృతి చెందినట్లు ఆరోగ్య శాఖ వెల్లడించింది. కొన్ని మరణాలపై తుది వైద్య నిర్ధారణ కొనసాగుతోంది.

చండీపుర వైరస్ ప్రధానంగా 15 సంవత్సరాల లోపు పిల్లలను ప్రభావితం చేస్తుందని వైద్య నిపుణులు తెలిపారు. వైరస్ సోకిన వారికి మొదట అధిక జ్వరం, తలనొప్పి, వాంతులు, ఒళ్లు నొప్పులు, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో మెదడుపై ప్రభావం చూపి పరిస్థితి విషమించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

ఈ వైరస్ ప్రధానంగా సాండ్‌ఫ్లైలు (ఇసుక ఈగలు) ద్వారా వ్యాపిస్తుందని నిపుణులు వెల్లడించారు. మనిషి నుంచి మనిషికి నేరుగా వ్యాపించినట్లు ఇప్పటివరకు ఆధారాలు లేవని అధికారులు స్పష్టం చేశారు. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో గుజరాత్ ప్రభుత్వం ప్రభావిత జిల్లాల్లో ప్రత్యేక వైద్య బృందాలను మోహరించి పర్యవేక్షణను ముమ్మరం చేసింది. అనుమానిత లక్షణాలతో ఆసుపత్రులకు వచ్చే చిన్నారులకు వెంటనే పరీక్షలు నిర్వహిస్తూ ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు.

పరిస్థితిపై కేంద్ర ఆరోగ్య శాఖ కూడా నిరంతరం సమీక్ష నిర్వహిస్తోంది. అవసరమైన మందులు, వైద్య సిబ్బంది, పరీక్షా కిట్లను అందుబాటులో ఉంచడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని విధాల సహకారం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. చిన్నారులకు జ్వరం, వాంతులు, తీవ్ర నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, సాండ్‌ఫ్లైలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఇ--20 పెట్రోల్ విధానంపై కేంద్రం స్పష్టత

న్యూఢిల్లీ, ఆగస్టు 4: ఇ--20 (20 శాతం ఇథనాల్ మిశ్రమ) పెట్రోల్ వినియోగంపై వస్తున్న సందేహాలకు కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. దేశంలో ముడి చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే ఈ విధానం ప్రధాన ఉద్దేశమని వెల్లడించింది.

ఇథనాల్ ఉత్పత్తికి ఉపయోగపడే చెరకు, మొక్కజొన్న తదితర పంటలకు డిమాండ్ పెరగడం ద్వారా రైతులకు అదనపు మార్కెట్ అవకాశాలు లభించి వారి ఆదాయం పెరుగుతుందని కేంద్రం తెలిపింది. ఇ--20 పెట్రోల్ వినియోగంతో కార్బన్ ఉద్గారాలు తగ్గి వాయు కాలుష్య నియంత్రణకు దోహదపడుతుందని పేర్కొంది.

దేశవ్యాప్తంగా ఇ--20 పెట్రోల్‌ను దశలవారీగా అందుబాటులోకి తీసుకొస్తున్నామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం 20 శాతం ఇథనాల్ మిశ్రమంతో కూడిన ఇంధన విధానమే అమలులో ఉందని, అంతకుమించి మిశ్రమ శాతాన్ని పెంచే నిర్ణయం ఏదీ తీసుకోలేదని స్పష్టం చేసింది. భవిష్యత్తులో శాస్త్రీయ అధ్యయనాలు, నిపుణుల సూచనలు, అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

# మోదీ ఓటమి ఎరుగని ధీరుడా?

## ప్రజా నిరసన తుఫానులో భగ్నమైన కమలనాథుల అజేయ కోటలు!

నరేంద్ర మోదీ రాజకీయం అంటేనే ఓటమెరుగని అజేయ ఆధిపత్యం, ఉత్తరాది గుండెకాయలో చెక్కుచెదరని అధికార పక్ష కోటలు అనే అభిప్రాయం గత దశాబ్ద కాలంగా భారత రాజకీయాల్లో బలంగా పాతుకుపోయింది. కానీ, ఇటీవల వెలువడిన బీహార్‌లోని బాంకీపూర్, మధ్యప్రదేశ్‌లోని దాటియా అసెంబ్లీ నియోజకవర్గాల ఉపఎన్నికల ఫలితాలు ఆ రాజకీయ రథచక్రాల వేగానికి అత్యంత గట్టి బ్రేకులు వేశాయి. సోమవారం అధికారికంగా వెలువడిన ఈ ఎన్నికల తీర్పు కేవలం రెండు అసెంబ్లీ స్థానాల గెలుపోటములకు మాత్రమే పరిమితమైన సాధారణ అంశం కానే కాదు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యక్తిగత బ్రాండ్ ఇమేజ్‌పై, అలాగే దశాబ్దాలుగా అధికార పార్టీ నిర్మించుకుంటూ వచ్చిన సంస్థాగత బలమైన ఆధిపత్యంపై క్షేత్రస్థాయి ప్రజల్లో రూపుదిద్దుకుంటున్న తీవ్ర అసంతృప్తికి, నిరసనకు స్పష్టమైన నిదర్శనం.

సొంత పాలనలో ఉన్న రాష్ట్రాల్లో, పార్టీకి అత్యంత సురక్షితమైనవిగా భావించే సొంత కోటల్లోనే ఎదురైన ఈ ఘోర పరాభవం కమలనాథుల అధిష్టానానికి ఒక భయంకరమైన స్వప్నంలా మారింది. 1995 నుంచి వరుసగా విజయం సాధిస్తూ, చివరికి పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కుటుంబానికి అత్యంత బలీయమైన పట్టున్న బాంకీపూర్ వంటి పక్కా పట్టణ కోటలో జన సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ చేతిలో అధికార పక్షం ఘోరంగా ఓడిపోవడం సామాన్యమైన విషయమేమీ కాదు. అక్కడ 19,324 ఓట్ల భారీ మెజారిటీతో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం, మరోవైపు మధ్యప్రదేశ్ లోని దాటియా స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి ఘనశ్యామ్ సింగ్ నెగ్గడం గమనిస్తే.. కమలనాథులకు ఏమాత్రం తిరుగులేదనుకున్న ఓటర్ల మనోభావాలలో ఎంతటి గుణాత్మకమైన మార్పు వచ్చిందో స్పష్టంగా అర్థమవుతోంది.

గత దశాబ్ద కాలంగా ప్రచార సాధనాలు, అధికార పక్ష నాయకులు కలిసి ఎంతో కష్టపడి నిర్మించిన 'అజేయమైన నాయకుడు' అనే ప్రధాని మోదీ ఇమేజ్‌ను ఢిల్లీ కేంద్రంగా సాగిన యువజన నిరసనలు, వీధి పోరాటాలు క్షేత్రస్థాయిలో తీవ్రంగా దెబ్బతీశాయి. ఒకప్పుడు ప్రజల్లో ప్రధాని మోదీ పట్ల ఉన్న గౌరవ భావం స్థానంలో నేడు తీవ్రమైన విమర్శలు, పరిహాసాలు చోటుచేసుకున్నాయి.




అంతర్జాతీయ ఆర్థిక విశ్లేషణల సంస్థ బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం అధికార పార్టీ సాధించే మొత్తం ఓటు షేర్‌లో మోదీ వ్యక్తిగత ప్రజాదరణ వాటానే దాదాపు 40 శాతం వరకు ఉంటుంది. మరి అలాంటి అత్యంత కీలకమైన నాయకుడి వ్యక్తిగత బ్రాండ్ ఇమేజ్ క్రమంగా మసకబారడం, ప్రచారంలో వాడుకునే 56 ఇంచుల నాయకుడి ప్రతిష్ఠపై క్షేత్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతుండటం అనేది రాబోయే రోజుల్లో అధికార పార్టీ భవిష్యత్తు ప్రచార వ్యూహాలకు తీవ్రమైన గొడ్డలిపెట్టు లాంటిదే అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఫలితాల వెనుక కేవలం భావోద్వేగ లేదా ముందస్తు సైద్ధాంతిక విజ్ఞప్తుల కంటే ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న భౌతిక, ప్రాథమిక సమస్యలే అత్యంత కీలక పాత్ర పోషించాయి. దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, విద్యా వ్యవస్థలో తీవ్రమైన లోపాలు, పదేపదే జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీలు, తమ హక్కుల కోసం నిరసన తెలుపుతున్న విద్యావంతులైన విద్యార్థులపై ప్రభుత్వం ప్రయోగిస్తున్న తీవ్ర పోలీసు అణచివేత వంటి అంశాలు సామాన్య ప్రజల్లో మోదీ సర్కారుపై ఉన్న ఆగ్రహానికి తీవ్రంగా ఆజ్యం పోశాయి. బాంకీపూర్ ఏమీ వెనుకబడిన గ్రామీణ ప్రాంతం కాదు, అది పాట్నా నగర పరిధిలోని విద్యావంతులు, ఎగువ మధ్యతరగతి, అగ్రకులాల జనాభా ఎక్కువగా ఉండే పట్టణ నియోజకవర్గం. ఇన్నాళ్లూ అధికార పక్షానికి అత్యంత సానుకూలమైన అండగా ఉండే ఇలాంటి వర్గాలు కూడా ప్రభుత్వ ప్రచార ఆర్భాటాలను పూర్తిగా తిరస్కరించి, ప్రజా సమస్యల ఆధారంగానే తీర్పు ఇచ్చాయని ఈ ఓటమి స్పష్టంగా రుజువు చేసింది.

అన్నింటికంటే ముఖ్యంగా, మోదీకి వ్యతిరేకంగా ఓటర్లందరూ ఒకే సమర్థుడైన అభ్యర్థి వెనుక ఏకమవుతున్నారనే సరికొత్త రాజకీయాన్ని ఈ ఫలితాలు చాటిచెప్పాయి. ఇప్పటివరకు ప్రతిపక్షాల మధ్య ఉండే అంతర్గత విభేదాలు, ఇతర పార్టీల పోటీల వల్ల అధికార పార్టీ వ్యతిరేక ఓట్లు చీలిపోయి అంతిమంగా అధికార పక్షం లబ్ధి పొందేది. కానీ బాంకీపూర్, దాటియా ఫలితాలు అందించిన పాఠాలు పూర్తిగా వేరుగా ఉన్నాయి. ప్రజలు తమ పాత రాజకీయ అనుబంధాల కంటే అధికార పక్షాన్ని ఓడించగల బలమైన ప్రత్యామ్నాయ అభ్యర్థికే ఓటేస్తున్నారని స్పష్టమవుతోంది. ఇది భవిష్యత్తులో రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ లాంటి ప్రతిపక్ష శక్తులు ఏకమై పోరాడటానికి, నియోజకవర్గ స్థాయిలో వ్యూహాత్మకంగా అధికార పక్షాన్ని దెబ్బతీయడానికి ఒక పెద్ద ఊపును, మార్గాన్ని ఇస్తుంది.

అంతేకాకుండా, ఒక బలమైన నాయకుడి రాజకీయాధిపత్యం బలహీనపడే కొద్దీ ప్రజాస్వామ్య వ్యవస్థల్లో గుణాత్మక మార్పులు రావడం నైజం. ప్రధాని రాజకీయ ఇమేజ్ దెబ్బతింటే, ఇన్నాళ్లూ ప్రభుత్వ ఒత్తిడికి లోనైన వార్తా సాధనాలు, న్యాయస్థానాలు వంటి రాజ్యాంగ వ్యవస్థలు కూడా పునరుజ్జీవనం పొందేందుకు నూతన స్థలం ఏర్పడుతుంది. అధికార పార్టీపై తీవ్రస్థాయిలో నిష్పాక్షికమైన నివేదికలు, క్రియాశీలక న్యాయ సమీక్షలు పెరిగే కొద్దీ ప్రభుత్వానికి మునుపటి లాంటి కవచాలు కరువవుతాయి. కనుక, ఈ ఉపఎన్నిక ఫలితాలను కేవలం రెండు నియోజకవర్గాల సాధారణ ఓటమిగా భావిస్తే కమలనాథులకు మున్ముందు మరిన్ని భయంకరమైన రోజులు తప్పవు. కేవలం భావజాల ప్రచారాల కంటే ప్రజా సమస్యలే ముఖ్యమని భావిస్తున్న ఓటర్ల మనోభావాలలో వచ్చిన మార్పును అంగీకరించి, తీరు మార్చుకోకపోతే అధికార పార్టీ తన సొంత గడ్డపైనే మరింత ప్రజాదరణను కోల్పోక తప్పదు.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# ట్రంప్ టారిఫ్‌లపై అమెరికాలో తీవ్ర నిరసన

తీసుకున్నారని ఆరోపించారు. గతంలో అత్యవసర అధికారాల కింద విధించిన టారిఫ్‌లను అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసినప్పటికీ, ఇప్పుడు 1974 ట్రేడ్ యాక్ట్‌లోని సెక్షన్--301ను ఆధారంగా చేసుకుని అదే తరహా సుంకాలను మళ్లీ అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ టారిఫ్‌ల వల్ల దిగుమతి వస్తువుల ధరలు పెరిగి అమెరికా ప్రజలు, వ్యాపార సంస్థలపై అదనపు భారం పడుతుందని రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేశాయి. నిత్యావసర వస్తువులు, నిర్మాణ సామగ్రి తదితర ఉత్పత్తుల ధరలు పెరిగి సామాన్య ప్రజల జీవన వ్యయం అధికమవుతుందని పేర్కొన్నాయి.

ట్రంప్ ప్రభుత్వం మాత్రం బలవంతపు శ్రమతో తయారయ్యే వస్తువుల దిగుమతులను అరికట్టడం, అమెరికా వాణిజ్య ప్రయోజనాలను కాపాడడమే ఈ టారిఫ్‌ల ఉద్దేశమని స్పష్టం చేసింది. అయితే ఈ కేసులో కోర్టు ఇచ్చే తీర్పు అమెరికా వాణిజ్య విధానంతో పాటు అధ్యక్షుడి అధికారాల పరిధిపై కూడా కీలక ప్రభావం చూపనుందని రాజకీయ, ఆర్థిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# రాజకీయ కక్షసాధింపులకు, బ్లాక్‌మెయిల్‌కే 'హైడ్రా'...

భూములను కట్టబెట్టేందుకు, అలాగే తమ నిర్ణయాలను ఎదురించే వారిని, వ్యతిరేకంగా మాట్లాడే వారిని బెదిరించి బ్లాక్‌మెయిల్ చేసేందుకే ప్రత్యేకం ఈ 'హైడ్రా'ను సృష్టించి వాడుతున్నారని మండిపడ్డారు.

సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన వ్యవస్థలను ప్రభుత్వం తన సొంత రాజకీయ కక్షసాధింపుల కోసం భ్రష్టు పట్టిస్తోందని ఈటల ఆరోపించారు. 'హైడ్రా' అనేది ప్రజల సంక్షేమం కోసం పనిచేసే సంస్థ కాదని, అది కేవలం ప్రజలను, సామాన్యులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తూ వేధించే ఒక రాక్షస సంస్థగా మారిందని దుయ్యబట్టారు. గతంలో జర్మనీలో హిట్లర్ ఏ రకంగానైతే ప్రజలను భయాందోళనలకు గురిచేసి వేధించారో, నేడు తెలంగాణలో రేవంత్ రెడ్డి కూడా అదే హిట్లర్ పాలనను ఆదర్శంగా తీసుకుని హైడ్రా ద్వారా ప్రజలను, నిరుపేదలను చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు హిట్లర్ ప్రజల హక్కులను కాలరాస్తే, నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైడ్రా పేరిట సామాన్యుల సంతోషాలను, జీవితాలను కూల్చేస్తోందని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో దశాబ్దాలుగా నివాసముంటున్న పేదల ఇళ్లను ఏకపక్షంగా కూల్చివేస్తూ, వారిని వీధిన పడేసే సంస్థగా హైడ్రా మారిందని ఈటల పేర్కొన్నారు. హైడ్రా అనుసరిస్తున్న బుల్డోజర్ సంస్కృతి మరియు ఏకపక్ష చర్యలను చూసి ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని అన్నారు. లీగల్ అనుమతులు ఉన్నప్పటికీ, నగరంలో కష్టపడి సంపాదించుకున్న సొమ్ముతో ఇల్లు లేదా ప్లాట్ కొనుగోలు చేయాలంటేనే సామాన్య ప్రజలు భయపడే పరిస్థితిని ప్రభుత్వం కల్పించిందని వ్యాఖ్యానించారు. నగరంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని, ప్రజల నమ్మకాన్ని ఈ నిర్ణయం పూర్తిగా దెబ్బతీసిందన్నారు. న్యాయవ్యవస్థను కూడా ఈ ప్రభుత్వం ఎంతమాత్రం గౌరవించడం లేదని ఆయన ఆరోపించారు. హైడ్రా సంస్థ రాజ్యాంగబద్ధమైన కోర్టుల ఆదేశాలను, తీర్పులను సైతం ఖాతరు చేయడం లేదని, న్యాయస్థానాల మాటలను కూడా పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. చివరకు ఈ సంస్థ ముఖ్యమంత్రి చెప్పే మాటలనైనా వింటుందో లేదో అని ప్రజల్లో తీవ్రమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చురకలు వేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండివైఖరిని వీడి, హైడ్రా పేరుతో సామాన్యులపై సాగిస్తున్న అరాచకాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లను కూల్చివేస్తూ వారి ఉపాధిని దెబ్బతీస్తే బీజేపీ తరఫున బాధితులకు అండగా ఉండి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## ముధోల్‌లోని వివిధ వార్డుల్లో ముమ్మరంగా 'డ్రై డే' పారిశుధ్య పనులు

ముధోల్, ఆగస్టు 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల కేంద్రంలోని వివిధ వార్డులలో మంగళవారం పంచాయతీ ఈఓ అన్వర్ అలీ ఆధ్వర్యంలో 'డ్రై డే' పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రతి వార్డులోని ఇంటింటికీ తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల ప్రాంగణాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, రోజూ వాడే నీటి తొట్లు, కూలర్లలో నీటిని ఎప్పటికప్పుడు తొలగించి ఎండబెట్టాలని సూచించారు.మురుగు నీరు నిలిచి ఉండే కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయించడంతో పాటు నిల్వ ఉన్న చెత్తను పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా తొలగించారు. డెంగ్యూ, మలేరియా దోమలు ప్రబలకుండా ప్రజలు పంచాయతీకి సహకరించాలని ఈఓ కోరారు.ఈ పారిశుధ్య తనిఖీల్లో వార్డు సభ్యులు నజియా అఫ్రోజ్, ఏఎన్ఎం జ్యోతి, ఆశా కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కమిటీల విస్తరణ అక్రమం: రామరాజు

.నిర్మల్, ఆగస్టు 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఏ) చేపట్టిన జిల్లాల విస్తరణ ప్రక్రియ పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఏ) నిర్మల్ జిల్లా కోచ్ రామరాజు తీవ్రంగా విమర్శించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ హెచ్‌సిఏ వైఖరిని ఎండగట్టారుహైకోర్టు మరియు బిసిసిఐ స్పష్టమైన ఆదేశాలను ధిక్కరిస్తూ హెచ్‌సిఏ ఏకపక్షంగా జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తోందని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రతిభావంతులైన క్రికెట్



క్రీడాకారులను విస్మరిస్తూ క్రికెట్‌ను వాణిజ్యపరం చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల నిర్వహించిన టిజి20 లీగ్‌లో 60 శాతానికి పైగా ఇతర రాష్ట్రాల ఆటగాళ్లకే ప్రాధాన్యం ఇచ్చారని, తెలంగాణ బిడ్డలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. న్యాయస్థానాల్లో వివాదాలు తేలేవరకు జిల్లా కమిటీల నియామకాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జిల్లా క్రికెటర్ల భవిష్యత్తు కోసం, పారదర్శకమైన క్రీడా పరిపాలన కోసం టిసిఏ పోరాడుతుందని స్పష్టం చేశారు. స్వార్థ ప్రయోజనాల కొరకు క్రికెట్‌ను బందీ చేయవద్దని రామరాజు పేర్కొన్నారు.

## హంగిర్గ గ్రామంలో ఉచిత ఆయుర్వేద, నేత్ర వైద్య శిబిరం ఘనంగా నిర్వహణ

తానూర్, ఆగస్టు 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తానూర్ మండలం హంగిర్గ గ్రామంలోని హనుమాన్ మందిరం ప్రాంగణంలో మంగళవారం ఉచిత ఆయుర్వేద మరియు నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ స్వామి భూమాబాయి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.
ఆయుర్వేద శిబిరంలో సీనియర్ డాక్టర్ ప్రకాష్ (బిఏఎమ్ఎస్) గ్రామస్థులకు కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, వెన్నునొప్పి, వాతం వంటి సమస్యలకు ఉచితంగా వైద్య పరీక్షలు జరిపి ఆయుర్వేద మందులను సూచించారు.
హైదరాబాద్ ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, గోపాల్ రావు ఐ హాస్పిటల్ బృందం ఉచితంగా నేత్ర



పరీక్షలు నిర్వహించి క్యాటరాక్ట్ (మోతిబిందు) ఉన్న వారికి ఉచిత ఆపరేషన్లకు మార్గదర్శనం చేశారు.
గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణే తమ ధ్యేయమని సర్పంచ్ తెలిపారు. శిబిరంలో పాల్గొన్న వైద్య బృందాన్ని గ్రామం తరఫున శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు, వార్డు సభ్యులు, విడిసి ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎడ్బిడ్ తాండా రహదారిలో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు చోరీ

ముధోల్, ఆగస్టు 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండలం ఎడ్బిడ్ గ్రామం నుండి ఎడ్బిడ్ తాండాకు వెళ్లే రహదారిలో చెరువు సమీపంలో ఉన్న 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుండి గుర్తుతెలియని వ్యక్తులు రాగి వైర్లు, ఆయిల్ చోరీ చేసిన ఘటన వెలుగు చూసింది.
సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి లోపలి విలువైన రాగి కాయిల్స్, లీటర్ల కొద్దీ విద్యుత్ ఆయిల్‌ను దొంగిలించి పరారయ్యారు. మంగళవారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు దీనిని గమనించి విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు.వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పంట పొలాలకు నీరు



అందక రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో విద్యుత్ పరికరాల చోరీలు పెరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు ముధోల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దొంగలను పట్టుకునేందుకు దర్యాప్తు ప్రారంభించారు.

## దిలావర్‌పూర్ పంచాయతీ పరిధిలో రైతులకు ఉచిత కూరగాయల విత్తనాల పంపిణీ

దిలావర్‌పూర్, ఆగస్టు 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దిలావర్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా కూరగాయల విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ అక్షరా అనిల్, ఉపసర్పంచ్ సుఖేష్, ఎంపీఓ గోవర్ధన్ చేతుల మీదుగా రైతులకు విత్తన ప్యాకెట్లను అందజేశారు.
ఇంటి ఆవరణలు, రైతు పొలాల గట్ల వెంట కూరగాయలు సాగు చేసుకోవడం ద్వారా పౌష్టికాహార లోపాన్ని అధిగమించవచ్చని, అదనపు ఆదాయం పొందే వీలుంటుందని ఎంపీఓ గోవర్ధన్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న



ఉచిత విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యానవన శాఖ ద్వారా మరిన్ని పథకాలు గ్రామీణ రైతులకు అందేలా కృషి చేస్తామని సర్పంచ్ అక్షరా అనిల్ చెప్పారు.కార్యక్రమంలో హార్టికల్చర్ విస్తరణ అధికారి సౌమ్య, పంచాయతీ కార్యదర్శి మహేందర్, వార్డు సభ్యులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## బాసర ఆలయ ప్రాంగణంలో వానరానికి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు

బాసర, ఆగస్టు 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
బాసర ప్రసిద్ధ శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్ర ప్రాంగణంలో మంగళవారం ఒక వానరం ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడి మృతిచెందింది. దేవాలయ విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ గోపాల్ సింగ్ దీనిని గమనించారు.
దేవాలయ ఎన్ఎమ్ఆర్ సిబ్బంది సహాయంతో మృతిచెందిన వానరానికి పసుపు, కుంకుమ, పూలమాలలతో ప్రత్యేక పూజలు నిర్వహించి అంతిమయాత్ర జరిపారు.
అనంతరం హిందూ సంప్రదాయబద్ధంగా వానరానికి అంత్యక్రియలు నిర్వహించి అమ్మవారి క్షేత్ర సిబ్బంది తమ మానవత్వాన్ని, మూగజీవాల పట్ల ఉన్న భక్తిభావ తీవ్రతను చాటుకున్నారు. సిబ్బందిని పలువురు భక్తులు అభినందించారు.



## గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

### .ఇరిగేషన్ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన సర్పంచ్‌లు

ముధోల్, ఆగస్టు 4(తెలంగాణ వెన్నెల వాక్కు ):గ్రామాల సమగ్ర అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర అత్యంత కీలకమని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ముధోల్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల స్థాయి ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులతో గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. సమావేశంలో పలువురు సర్పంచ్‌లు తమ గ్రామాల్లో ఎదురవుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఇరిగేషన్ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సాగునీటి శాఖకు సంబంధించిన సమస్యలను




వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్‌లు లేవనెత్తిన సమస్యలు, అంశాలను సంబంధిత అధికారులు సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు అవసరమైన సేవలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ఆనందరావు పటేల్, ఆత్మ చైర్మన్ నర్సారెడ్డి, మండల ప్రత్యేక అధికారి లక్ష్మణ్ బటేకర్, ఆర్ అండ్ బి డిఈ వాగ్మారే సునీల్ కుమార్, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో లవ్‌కుమార్, ఎంపీవో శివకుమార్, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వీబీజీ రాంజీ ఉపాధి హామీ ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలి: నిరసన

ముధోల్/తానూర్, ఆగస్టు 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) విధులు నిర్వహిస్తున్న వీబీజీ రాంజీ ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేయాలని, ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు చెల్లించాలని కోరుతూ తానూర్ మండల ఉపాధి హామీ సిబ్బంది మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు (టీఏలు), కంప్యూటర్ ఆపరేటర్లు మాట్లాడుతూ.. తాము గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల ప్రణాళిక, సాంకేతిక అంచనాలు, మస్టర్ రోల్స్ నిర్వహణ, బిల్లుల నమోదుతో పాటు పల్లె ప్రగతి, పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. రోజువారీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ సరైన ఉద్యోగానికి రక్షణ లేకపోవడం విచారకరమన్నారు.



నెలల తరబడి వేతనాలు రాకపోవడం వల్ల కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇంటి అద్దెలు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా తమకు కూడా క్రమం తప్పకుండా ప్రతి నెలా వేతనాలు అందేలా చూడాలని, పేస్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వినతిపత్రం స్వీకరించిన ప్రత్యేక అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉపాధి హామీ సిబ్బంది ప్రస్తావించిన సమస్యలు న్యాయమైనవని, వినతిపత్రాన్ని ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నివేదిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తానూర్ మండల ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మల్ పట్టణంలో రేషన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎస్ఓ రాజేందర్

.నిర్మల్, ఆగస్టు 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా కేంద్రంలోని సిద్ధాపూర్, బాగులవాడ, గాంధీ చౌక్ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ చౌక ధరల బియ్యం (రేషన్) దుకాణాలను జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్ఓ) రాజేందర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ దుకాణాల్లో సరుకుల నిల్వలు, పంపిణీ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా డీఎస్ఓ రాజేందర్ దుకాణాలకు వచ్చిన లబ్ధిదారులతో నేరుగా ముచ్చటించారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న మూడు నెలల కోటా బియ్యం పూర్తి స్థాయిలో అందుతున్నాయా లేదా



అని అడిగి తెలుసుకున్నారు. బియ్యం నాణ్యత, రేషన్ డీలర్ల ప్రవర్తనపై వివరాలు సేకరించారు. లబ్ధిదారులకు బియ్యం పంపిణీలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
అనంతరం ఆయన మాట్లాడుతూ, తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబ సభ్యులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ (వ-ఖ్జ) ప్రక్రియను పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ కార్డులో పేరున్న ప్రతి ఒక్కరూ తమ వేలిముద్రలను సమీప రేషన్ దుకాణాల వద్ద నమోదు చేయించుకోవాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో బియ్యం పొందేందుకు ఇబ్బందులు ఎదురవుతాయని స్పష్టం చేశారు.
ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్‌తో పాటు అసిస్టెంట్ సప్లై ఆఫీసర్ (ఏఎస్ఓ) స్వామి, డీటీ ఇన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ముంతాజ్, స్థానిక రేషన్ డీలర్లు, కార్డుదారులు పాల్గొన్నారు.

# సిఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన 112 సెల్ ఫోన్లు బాధితులకు అందజేత: ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్, ఆగస్టు 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పోగొట్టుకున్న మరియు చోరీకి గురైన మొబైల్ ఫోన్లను అత్యాధునిక 'సిఈఐఆర్' (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా సాంకేతిక ఆధారాలతో వేగంగా గుర్తించి రికవరీ చేయడంలో నిర్మల్ జిల్లా పోలీసులు విశేష సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా రికవరీ చేసిన సుమారు 12 లక్షల 88 వేల రూపాయల విలువ కలిగిన 112 సెల్ ఫోన్లను జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల బాధితులకు స్వయంగా అందజేశారు. పోయిన తమ విలువైన ఫోన్లు తిరిగి చేతికి అందడంతో బాధితులు పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల మాట్లాడుతూ, ప్రస్తుత ఆధునిక డిజిటల్ జీవన విధానంలో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి నిత్య జీవితంలో అత్యంత కీలకమైన పరికరంగా మారిందన్నారు. ఫోన్ పోగొట్టుకున్నా లేదా దొంగతనానికి గురైనా ప్రజలు అధైర్యపడకుండా తక్షణమే సిఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. బాధితులు స్వయంగా తమ మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చని, లేదంటే ఫోన్ కొనుగోలు బిల్లు, ఐఎంఈఐ నంబర్, అవసరమైన ధ్రువపత్రాలతో సమీపంలోని పోలీసు స్టేషన్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. సిఈఐఆర్ ద్వారా ఫోన్ బ్లాక్ కావడం వల్ల దుర్వినియోగం కాకుండా రక్షణ లభిస్తుందన్నారు. సంతలు, మార్కెట్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, బస్సులు మరియు ఇతర ప్రజా రద్దీ ప్రాంతాల్లో ప్రయాణించే సమయంలో ప్రజలు తమ వద్ద ఉన్న మొబైల్ ఫోన్ల విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోరారు. ముఖ్యంగా గుమిగూడే రద్దీ సమయాల్లో జేబు దొంగలు, చోరీలకు పాల్పడే నేరస్థులు ఫోన్లను లాక్కునే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే మార్కెట్లో సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసే ముందు ఒరిజినల్ బిల్లు, పెట్టె, ఐఎంఈఐ నంబర్ వివరాలను తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని, ధ్రువీకరణ లేని అనుమానాస్పద ఫోన్లను కొనుగోలు చేసి సమస్యల్లో చిక్కుకోవద్దని హెచ్చరించారు. సిఈఐఆర్ వ్యవస్థ అమల్లోకి వచ్చినప్పటి నుండి నిర్మల్ జిల్లా పోలీసులు సాంకేతిక




ఆధారాలను పక్కాగా విశ్లేషిస్తూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 2,377 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ఆయా బాధితులకు సురక్షితంగా అందజేసినట్లు ఎస్పీ వివరించారు. ప్రజల సొత్తును కాపాడటంలో నిర్మల్ జిల్లా పోలీసులు నిరంతరం ముందుంటారని స్పష్టం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి ఫోన్ల ఆచూకీ కనుగొనడం అభినందనీయమన్నారు.
సాంకేతిక ఆధారాలను సేకరిస్తూ, నెట్‌వర్క్ ప్రొవైడర్ల సహాయంతో పోగొట్టుకున్న ఫోన్ల ఆచూకీని వేగంగా ఛేదించడంలో నిరంతరం శ్రమించిన ఐటీ కోర్ సిబ్బందిని, సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా కొనియాడారు. సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక దృష్టి సారించి నేరాల నివారణకు, బాధితులకు సత్వర సహాయం అందించేందుకు సిబ్బంది మరింత ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులోనూ ఇదే తరహాలో రికవరీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ ఫోన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిలతో పాటు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, జిల్లా ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్లు, పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది మరియు సెల్ ఫోన్లు అందుకున్న బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సారంగాపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో ఉచిత వృత్తి విద్యా శిక్షణ వివరాల వెల్లడి



.సారంగాపూర్, ఆగస్టు 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సారంగాపూర్ మండల పరిధిలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులు ప్రభుత్వం, ప్రముఖ సేవా సంస్థలు అందిస్తున్న ఉచిత శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును ఉజ్జ్వలంగా తీర్చిదిద్దుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) లక్ష్మీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ప్రథమ్ ఫౌండేషన్, ఎన్ఎస్‌డీసీ ప్రతినిధులతో కలిసి మీడియాతో మాట్లాడారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) సౌజన్యంతో ప్రథమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణలో చేరే అభ్యర్థులకు ఉచితంగా యూనిఫాం, నాణ్యమైన భోజనంతో కూడిన వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. శిక్షణ ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికేట్‌తో పాటు 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన లేదా మధ్యలో ఆపేసిన 18 నుండి 30 సంవత్సరాల వయస్సు కలిగిన యువకులు ఈ కోర్సులకు అర్హులని చెప్పారు. కంప్యూటర్, హోటల్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రికల్, టూ వీలర్ మెకానిక్, సోలార్ మరియు హాస్పిటాలిటీ రంగ్‌లో కోర్సులు ఉంటాయని వివరించారు. ఈ శిక్షణ విదేశాలకు వెళ్లే వారికి కూడా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.
ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువకులు వెంటనే సారంగాపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా అధికారి పసుల రమేష్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి నెల మొదటి బుధవారం 'సైబర్ జాగృతి దివస్': ఎస్పీ జానకి షర్మిల



నిర్మల్, ఆగస్టు 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆదేశాల మేరకు ప్రజల్లో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రతి నెల మొదటి బుధవారం నిర్మల్ జిల్లా వ్యాప్తంగా "సైబర్ జాగృతి దివస్" నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రూపొందించిన ప్రత్యేక పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సైబర్ నేరస్థులు రోజురోజుకూ కొత్త పద్ధతుల్లో అమాయక ప్రజలను మోసం చేస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, మార్ఫింగ్ వీడియోలు, అధిక లాభాల పేరుతో వచ్చే ప్రకటనలను నమ్మి డబ్బులు జమ చేయవద్దని హెచ్చరించారు .యాప్‌లలో కనిపించే లాభాలు నకిలీవని, గుర్తింపు పొందిన సంస్థల్లోనే పెట్టుబడులు పెట్టాలని తెలిపారు. కేవలం ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి తెలియనటు వంటి వ్యక్తుల ఖాతాలకు డబ్బులు బదిలీ చేయకూడదన్నారు. సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్ లైన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు .ఈ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో పాటు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, టౌన్ సీఐ సమ్మయ్య, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రమణ, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# స్వర్ణ ప్రాజెక్టు నుంచి దిగువ ప్రాంతాలకు 100 క్యూసెక్కుల సాగునీటి విడుదల!

సారంగాపూర్, ఆగస్టు 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సారంగాపూర్ మండల పరిధిలోని ప్రాచీన స్వర్ణ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని దిగువ ప్రాంత పంట పొలాలకు సాగునీటి కొరత తీవ్రం కాకుండా శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని మంగళవారం ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేయించారు. ప్రాజెక్టు జౌళి నాలా ద్వారా 80 క్యూసెక్కులు, ఎడమ కాలువ (లెఫ్ట్ కెనాల్) ద్వారా 20 క్యూసెక్కుల నీటితో కలిపి మొత్తం 100 క్యూసెక్కుల సాగునీటిని దిగువ ప్రాంత రైతుల పంట పొలాల అవసరార్థం కాలువల గుండా వదిలారు. కాలువలోకి ఉధృతంగా నీరు విడుదల కావడంతో ఆయకట్టు రైతాంగం హర్షాతిరేకాలు వ్యక్తం చేసింది.
ప్రస్తుత వర్షాకాలంలో పంటల ఎదుగుదలకు సాగునీరు అత్యంత కీలకమైన తరుణంలో, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడి నీటి విడుదలకు చర్యలు చేపట్టారు. ఈ నీటి విడుదలతో సారంగాపూర్ మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో ఉన్న వేలాది ఎకరాల పత్తి, వరి, ఇతర పంట పొలాలకు సాగునీటి లభ్యత పెరిగి రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని నాయకులు తెలిపారు. సాగునీరు అందక ఆందోళన చెందుతున్న రైతులకు ఈ నీటి విడుదల కొండంత అండగా నిలిచింది.
ఇదే సమయంలో స్వర్ణ ప్రాజెక్టు ప్రధాన గేట్ల వద్ద జరుగుతున్న నీటి లీకేజీలను ఇరిగేషన్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఆదేశించారు. డ్యామ్ భద్రతకు, నీటి నిల్వకు ఆటంకం కలగకుండా లీకేజీలకు వెంటనే అవసరమైన సాంకేతిక మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టులో నీటి వృథాను అరికడుతూ, ప్రతి బొట్టు నీటిని రైతు పొలానికి మళ్లించేలా కెనాల్ నిర్వహణను సమర్థవంతంగా పర్యవేక్షించాలని ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.



స్వర్ణ ప్రాజెక్టు పరిధిలోని కాలువల చివరన ఉన్న (టెయిల్ ఎండ్) పొలాలకు కూడా సాగునీరు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కాలువల వెంట ఆటంకాలు ఉంటే తొలగించి, నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. సాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం, శాసనసభ్యులు కృషి చేస్తున్నారని వెల్లడించారు.
రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, వ్యవసాయ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు, సాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే రోజుల్లో పంటల సాగు అవసరాలను, ప్రాజెక్టులోని నీటి నిల్వ మట్టాలను బేరీజు వేసుకుంటూ నీటి విడుదల పరిమాణాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నీటి విడుదల కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కాల్వ నరేష్, ఉపాధ్యక్షుడు సత్యం చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్, నాయకులు రాంశంకర్ రెడ్డి, సాయబ్‌రావు, బండి పోతున్న, మల్లేష్, కొమ్ము సురేందర్, చెన్న రాజేశ్వర్, తిరుమలచారి, నారాయణరెడ్డి, కోరిపెల్లి రాజేశ్వర్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, స్థానిక రైతులు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణంలో విద్యనందించాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, ఆగస్టు 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రాథమిక, ఉన్నత పాఠశాల చిన్నారులకు ఒత్తిడి లేని, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఉపాధ్యాయులను, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం సోన్ మండల కేంద్రంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను (జెడ్పీహెచ్ఎస్) కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యాబోధన తీరు, మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు శాతాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.
ముందుగా ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ భవేశ్ మిశ్రా, పాఠశాల రిజిస్టర్లు, ఉపాధ్యాయుల వివరాలు, మధ్యాహ్న భోజనం అమలవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులతో ఇంగ్లీషు పుస్తకాల్లోని కథలను చదివించి, వాటి నుండి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు ధైర్యంగా సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులను ఎంతో మెచ్చుకుని, వారికి బహుమతిగా పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులకు అర్థం కాని కఠినమైన పదాలను స్వయంగా బ్లాక్ బోర్డుపై రాసి వివరించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులతో రోజూ తరగతి గదిలో పుస్తకాలను చదివించడం ద్వారా వారిలో భాషా జ్ఞానం, సబ్జెక్టుపై అవగాహన, ఆలోచనా శక్తి మెరుగుపడతాయన్నారు. ప్రతి పాఠశాలలో రోజూ కొంత సమయం కేటాయించి విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు కథల పుస్తకాలు చదివించాలని ఉపాధ్యాయులకు సూచించారు. బోధనలో ప్రామాణికమైన, చమత్కారమైన నూతన పద్ధతులు ఉపయోగిస్తే విద్యార్థులకు చదువుపై ఆసక్తి, శ్రద్ధ పెరుగుతాయన్నారు. బడికి రావడానికి పిల్లలు ఉత్సాహం చూపుతారన్నారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్, పదవ తరగతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఇప్పటివరకు పూర్తయిన సిలబస్ వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. భౌతిక శాస్త్రంలో 'దర్పణాలు' పాఠం నుండి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు గలగలా సమాధానాలు చెప్పడంతో కలెక్టర్ సంతోషం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. పాఠ్యాంశాల్లోని ప్రయోగాత్మక విషయాలను నిత్య జీవితానికి అన్వయించుకుని చదివితే విజ్ఞానం సులభంగా అర్థమై, జీవితాంతం గుర్తుంటుందని విద్యార్థులకు హితవు చెప్పారు.
పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి తాగునీరు, పారిశుధ్య ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ విద్యార్థులకు పరిశుభ్రమైన, రుచికరమైన నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని పాఠశాల నిర్వాహకులకు స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికతో బోధన అందించాలన్నారు. హాజరైన అధికారులు: ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న, సోన్ తహసీల్దార్ సంతోష్, ఎంపీఓ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముధోల్ ఆసుపత్రికి రూ.లక్ష విలువైన ఈసీజీ యంత్రం బహూకరణ



ముధోల్, ఆగస్టు 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి 1974-76 సంవత్సరాల్లో ఇక్కడ తొలిసారిగా వైద్యురాలిగా సేవలందించిన డాక్టర్ కర్ణకోట కళావతి రూ.లక్ష విలువైన ఉచిత ఈసీజీ యంత్రాన్ని, వాటర్ ప్యూరిఫైయర్‌ను బహూకరించి తమ ఉదారతను చాటుకున్నారు. బాసర సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చిన ఆమె ఆసుపత్రికి ఈ విరాళాన్ని ప్రకటించారు. 50 సంవత్సరాల క్రితం తాను మొదటిసారిగా ప్రభుత్వ వైద్యురాలిగా బాధ్యతలు స్వీకరించిన ముధోల్ ఆసుపత్రి అభివృద్ధికి, ఇక్కడి నిరుపేద రోగుల చికిత్సకు తన వంతు సాయం అందించడం ఆనందంగా ఉందని డాక్టర్ కళావతి తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్ ఈ పరికరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ వీడియో కాల్ ద్వారా డాక్టర్ కళావతితో మాట్లాడి, సుదీర్ఘకాలం తర్వాత కూడా తాను పనిచేసిన ఆసుపత్రిని గుర్తుంచుకుని ఈసీజీ యంత్రం విరాళంగా ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులు డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ అస్రార్, టీబీ సూపర్వైజర్ లాలయ్య, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com